క్లుప్తంగా

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు అందిస్తున్న సత్యనారాయణ

గొలుగొండ: ప్రతి ఒక్కరికీ భోగభాగ్యాలు కలగజేయాలని భగవంతుడ్ని వేడుకున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ తెలిపారు. పాతమల్లంపేట పంచాయతీలో ఆదివారం ఆయన పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గిరి గ్రామాలైన బుడ్డడపాడు, పోలవరం, చంద్రయ్యపాలెం, నిమ్మగెడ్డ, అచ్చియ్యపేట, కొత్తపాలెం, అంటిమాను జోర్లలో ఇంటింటికీ కుటుంబ సమేతంగా వెళ్లి చీరలు అందించి పండగ వాతావరణం తీసుకొచ్చారు. తమ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ ముందు రోజు 15 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లెక్కల కాశీరత్నం, సతీష్, విజయ్, సాయి, శ్రీను, అనిల్, శరత్ పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కె.కోటపాడు: ఎ.కోడూరులోని యాతపేటలో పేకాడుతున్న ఐదుగురిని ఎ.కోడూరు ఎస్‌ఐ జె.రమేష్ పట్టుకున్నారు. పేకాడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం రాత్రి తన సిబ్బందితో దాడి చేశారు. వీరి నుంచి రూ.2,100 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో రెండు పశువులకు తీవ్ర గాయాలు



గాయపడిన పశువులకు వైద్యం అందిస్తున్న పశువైద్యాధికారి ప్రియాంక

దేవరాపల్లి: తారువలో శనివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన గుల్లిపల్లి రమణ పశువుల పాక దగ్ధమైంది. దాంతో రెండు పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం మామిడిపల్లి పశువైద్యాధికారి జి.ప్రియాంక తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని వాటికి వైద్య సేవలందించారు. పశువుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను బాధిత రైతుకు వివరించారు.

వారాడలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో ప్రసాద్, సర్పంచ్ సాజన్య

కె.కోటపాడు: వారాడలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందవచ్చని తెలిపారు. అనంతరం సర్పంచ్ గొర్రుపోటు సౌజన్యతో కలిసి ఆరోగ్యశ్రీ గుర్తింపు కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, హౌసింగ్ ఏఈ నాయుడు, వైద్యాధికారి శైలజ, హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



గాదిరాయిలో పింఛన్ అందిస్తున్న దృశ్యం

మాడుగుల: గాదిరాయిలో ఆదివారం రాత్రి పది మందికి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. వీరంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు. మరలా జగనే సీఎం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు పర్రె రాముడునాయుడు, సలాది అచ్చంనాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336
సాక్షి



బుచ్చెయ్యపేట మండలంలో భోగి మంటలు



వడ్డాది సంతలో కొనుగోలుదారులతో సందడి



భోగి మంట వేస్తున్న క్లబ్ గౌరవాధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు



బసవన్నతో అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ దంపతులు

పల్లె లోగిళ్లు.. భోగి సందళ్లు..

- వైభవంగా ముగిసిన మేలుకొలుపు
- పండగ సామగ్రి కొనుగోళ్లతో దుకాణాల కిటకిట
- నేటి నుంచి గ్రామ తీర్థాలు ప్రారంభం
- వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి. అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

వాడవాడలా భోగి సంబరాలు అంబరాన్నంటాయి. లోగిళ్లలో భోగి మంటలు వేసి చలిని పారదోలారు. ఆ భోగినీళ్లతో తలస్నానమాచరించారు. మరోవైపు ప్రతి ఇల్లు రంగవల్లికలతో కళకళలాడింది. డూడూబసవన్నల హడావుడి.. చిన్నారులు కేరింతల నడుమ గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. నేటి నుంచి ప్రారంభమయ్యే గ్రామ తీర్థాలకు సర్వం సిద్ధం చేశారు.

దేవరాపల్లి: ప్రతి ఇంటా భోగి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. తారువ రామాలయం వద్ద భోగి వేడుకల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. సీతారాముల వారిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. స్థానిక యువతతో కొద్ది సేపు ముచ్చటించారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఆదివారం తెల్లవార జాము నుంచి రామాలయంలో స్థానిక భక్తులంతా భజనలు చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మికత సంతరించుకుంది. దేవరాపల్లిలో భోగి వేడుకల్లో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు దంపతులు పాల్గొన్నారు.

నర్సీపట్నం: పట్టణంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భోగి వేడుకలకు కడప అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ, కిరణ్మయి, పాడుతా తీయగా విన్నర్ ధీరజ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ దంపతులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ దంపతులను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, సభ్యులు సంప్రదాయ దుస్తులతో కుటుంబ సభ్యులతో పాల్గొని భోగి మంట వేశారు. భోగి మంట చుట్టూ ప్రదర్శనలు చేసి మహిళలు అడుగులో అడుగు వేస్తూ నృత్యం చేస్తూ వేడుకలను జరుపుకున్నారు.

నాతవరం: వాడ వాడలా భోగి పండగను ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో ముగ్గులు పోటీలు, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఆలయాలు భక్తులతో సందడిగా కనిపించాయి.

మాకవరపాలెం: మండలంలో భోగి పండగను ప్రజలంతా ఘనంగా జరుపుకున్నారు. ధనుర్మాసం సందర్భంగా నెలరోజులుగా నిర్వహిస్తున్న మేలుకొలుపు కార్యక్రమాన్ని లచ్చన్నపాలెం ఆదివారంతో ముగించారు.

బుచ్చెయ్యపేట/రావికమతం: గ్రామాల్లో భోగి పండగను కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందంగా జరుపుకున్నారు. పిడకలు వేసి చలి మంటను కాగారు. చిన్న పిల్లల తలపై జిల్లేడు ఆకులపై రేగు పళ్లు ఉంచి తలంటి స్నానాలు చేయించి పిల్లల్లో కీడు పోవాలని పూజలు చేశారు. సోమవారం పితృదేవతల పూజలకు వడ్డాది సంతలో కొత్త బట్టలు కొనుగోలు చేశారు. ఇంటి సామగ్రి, నాటుకోళ్లు కొనుగోలు చేశారు. సోమవారం బంగారుమెట్టలో అచ్చమ్మ పేరంటాల తీర్థం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందెంతోపాటు పలు రకాల ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు.

రోలుగుంట: భోగి సందర్భంగా జేపీ అగ్రహారంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భోగి స్నానాలు అనంతరం స్థానిక రామాలయం వద్ద సీతారాముల విగ్రహాలను పల్లకిపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సర్పంచ్ చిటికెల పద్మ దంపతులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కె.కోటపాడు/మాడుగుల/మాడుగుల రూరల్: ధనుర్మాసోత్సవాలు ముగియడంతో రామాలయాలు, వైష్ణవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జె.డి.పేటలో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. మాడుగుల వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ కోశిరెడ్డి కృష్ణమూర్తి పాల్గొన్నారు. కె.జె.పురం కల్యాణ వేంకటేశ్వర తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు, సభ్యులు పాల్గొన్నారు.



మాకవరపాలెం: లచ్చన్నపాలెంలోని మేలుకొలుపులో స్థానికులు



మాడుగుల రూరల్: కె.జె.పురం గాంధీ వీధిలో వేసిన భోగి మంటల వద్ద ప్రజలు

జిల్లా స్థాయి ఎడ్ల పోటీలు

గ్రామాల్లో అమ్మవార్లు, దేవతామూర్తుల తీర్థాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ తీర్థాలు మహా శివరాత్రి వరకు నిర్వహించనున్నారు. కె.జె.పురంలో సంక్రాంతి నుంచి పది రోజుల పాటు రోజూ అమ్మవార్ల తీర్థాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా సోమవారం పరిదేశమ్మ తీర్థం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పందేం పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు వరుసగా రూ.12వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు అందజేస్తామని, వీటితోపాటు కబడ్డీ, సైకిల్ స్పీడ్, ముగ్గులు, పిడతలు పోటీలు ఉంటాయని పేర్కొంది. ఈ నెల 16న సత్యవరంలో రాములోరి తీర్థం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కిటకిటాడిన దుకాణాలు..

సంక్రాంతి పండగకు కావాల్సిన పూజా సామగ్రి కొనుగోలుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావడంతో ఘాట్‌రోడ్ జంక్షన్‌తోపాటు మాడుగులలో వస్త్ర వ్యాపార, కూరగాయల దుకాణాలు ఆదివారం కిటికిటలాడాయి. మరోవైపు దూర ప్రాంతాల నుంచి గ్రామాలకు వస్తున్న వారితో మాడుగుల బస్టాండ్ రద్దీగా కనిపించింది.



తారువ భోగి వేడుకల్లో భాగంగా స్థానిక యువతతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లిలో భోగి మంట వద్ద ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు దంపతులు



కె.కోటపాడులో భోగి వేడుక..



మాడుగుల రూరల్: అవురువాడలో భోగి మంటలు వేస్తున్న స్థానికులు



రావికమతం: కొత్తకోట వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద భోగి మంట వేసిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు



రోలుగుంట: ప్రజలకు అన్నదానం చేస్తున్న సర్పంచ్ చిటికెల పద్మ దంపతులు



మాడుగుల: ఘాట్‌రోడ్ జంక్షన్‌లో కొనుగోలుదారులతో కిటకిట



మాడుగుల: జేడీపేటలో మేలుకొలుపు ముగింపు వేడుకలో వైస్ ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ కృష్ణమూర్తి తదితరులు

కమనీయం.. గోదాదేవి కల్యాణం

వడ్డాది వెంకన్న ఆలయంలో వేడుక



వడ్డాదిలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం



మాడుగుల పార్థసారథి ఆలయంలో గోదాదేవి కల్యాణం



కె.జె.పురంలో కల్యాణం జరిపిస్తున్న వైదిక పండితులు

బుచ్చెయ్యపేట: ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి రంగనాథ స్వామివారికి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస ముగింపు సందర్భంగా ఈ కల్యాణాన్ని ఆలయ పంతులు అంగర శ్రీకాంతచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పార్థసారథి ఆలయంలో...

మాడుగుల: అతి పురాతనమైన పార్థసారథి ఆలయంలో వైభవంగా గోదాదేవి కల్యాణం జరిగింది. గ్రామానికి చెందిన గృహస్తు దంపతులు చెరుకూరి వెంకట భాస్కరరావు, ఉష, దుక్కా రమణారెడ్డి సత్యవతి, జాగాని వెంకటరమణ (నానాజీ) ఆర్థిక సాయంతో గోదాదేవి కల్యాణం అలనాటి సంప్రదాయం ప్రకారం నిర్వహించామని, ప్రధాన అర్చకుడు పార్థసారథాచార్యులు వాసు తెలిపారు.

కె.జె.పురంలో..

మాడుగుల రూరల్: కె.జె.పురంలో గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. స్థానిక కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులను కళావేదికపై ఆశీనులు చేసి ప్రధాన అర్చకుడు ఎ. సుదర్శనాచార్యులు కల్యాణం జరిపించారు.

నాతవరంలో నంది విగ్రహం ప్రారంభం



నంది విగ్రహాన్ని ప్రారంభిస్తున్న నాయకుడు కరక అప్పలరాజు, గ్రామపెద్దలు

నాతవరం: భోగి సందర్భంగా నంది విగ్రహాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం ఎదురుగా స్థలంలో గ్రామస్తుల సహకారంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఆయన గ్రామపెద్దలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతన్నలకు చిహ్నంగా భావించే నంది విగ్రహాన్ని తమ గ్రామంలో ఏర్పాటు చేయాలని 20 ఏళ్ల క్రితం నిర్ణయించామన్నారు. ఈనాటికి కార్యరూపం దాల్చడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శెట్టి లచ్చబాబు, నాతవరం వర్తక సంఘం ప్రతినిధి శ్రీనివాసరావు, నల్లకొండమ్మ ఆలయ కమిటీ సభ్యుడు పోలిరెడ్డి రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

చోడవరం రూరల్: మండలంలోని గజపతినగరం జంక్షన్ వద్ద భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డులో ఆదివారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో చందక సన్యాశిరావు(62) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయన అంభేరుపురం గ్రామవాసిగా గుర్తించారు. మృతుడు తన మనుమడుతో కలసి గజపతినగరం వైపున పొలాల నుంచి చెరకు మోసుల మోపును తన మోటార్‌సైకిల్ వెనుక కట్టి అంభేరుపురానికి వస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన మరో బైకు చెరకు మోసుల మోపునకు తాకడంతో సన్యాసిరావు బైకు అదుపుతప్పింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న నాటుబండిని ఢీకొట్టగా అతడితోపాటు కిందపడిపోగా, మనుమడు సైతం తూలి పడిపోయాడు. సన్యాసిరావు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన మనుమడు రోడ్డు మార్జిన్‌లో పడడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుని భార్య రాము సంఘటనా స్థలికి చేరుకుని రోదిస్తున్న తీరు పలువురిని కలచివేసింది. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు. చోడవరం ఎస్‌ఐ బి.అప్పలనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా జరిపించి, పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

- అపూర్వ సమ్మేళనంలో చిత్తూరు జిల్లా ఉపాధ్యాయుడు శెట్టి రామకృష్ణ



గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నాతవరం: సమాజం అన్ని రంగాలుగా అభివృద్ధి చెందాలంటే అందరూ చదువుకున్నప్పుడే సాధ్యపడుతుందని చిత్తూరు జిల్లా ఉపాధ్యాయుడు శెట్టి రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక యూపీ స్కూల్‌లో 1988 నుంచి 2001 వరకు ఆర్కే ట్యూషన్ టీచర్ల వద్ద చదువుకున్న విద్యార్థులంతా ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. అప్పటి ట్యూషన్ చెప్పే ఉపాధ్యాయులు వివిధ ప్రాంతాల్లో స్థిరపడగా, వారి శిష్యుల్లో చాలా మంది ఉన్నత స్థాయిలో వివిధ హోదాల్లో ఉన్నారు. వారంతా కలుసుకోవడంతో ఆనందం వెల్లివిరిసింది. ఆర్కే ట్యూషన్ వ్యవస్థాపకుడు శెట్టి రామకృష్ణ, నాతవరం ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సంహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం గ్రామానికి పాఠశాలలో పలు సేవా కార్యక్రమాలు చేసేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారి రుత్తల వెంకటరమణ, ఎన్ఆర్ఐలు శెట్టి సతీష్, పైల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ద్విచక్ర వాహనం బోల్తా



గాయపడిన ఏసురాజు

రోలుగుంట: కొత్తకోట -రోలుగుంట ఆర్అండ్‌బీ రోడ్డులో కంచుగుమల కూడలి వద్ద ఆదివారం బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న కొంతలం గ్రామానికి చెందిన కేశరపూడి ఏసురాజు(18) తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన శామ్యూల్‌గా పిలవబడే ఏసురాజు కొత్తకోట వెళ్లి అక్కడ నుంచి రోలుగుంట వస్తుండగా ఈ ప్రమాదానికి గురయ్యాడు. గాయపడ్డ వ్యక్తిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై ఎల్.సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

కోలాటం మహిళలకు చీరల పంపిణీ



చీరలను అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, సత్యంనాయుడు

కె.కోటపాడు: సూదివలసకు చెందిన రాధాకృష్ణ మహిళా కోలాటం, సీతారామాంజనేయ మహిళా కోలాటం ఆడే 54 మంది మహిళలకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు కిలపర్తి వెంకట సత్యంనాయుడు వీటిని సమకూర్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోలాట ప్రదర్శన ద్వారా ప్రజల్లో భక్తిభావం కలిగిస్తున్న వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education
■ బైజ్డ్ 10th, One Sitting Inter, B.A, Degree, PG, BBA, BCA, MBA, MCA, Diploma, B.Tech, M.Tech, D.Pharma, B.Pharma, B.SC (Arg), B.SC (Nursing), BEd, BL, Ph.D Eligible for All Govt Jobs, Futhier Studies and Abroad. Ph: 83417 74299 [V- 796971]

Real Estate
■ గుంటూరు జిల్లాలో గోరంట్ల, లాం, JKC రోడ్డు, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజా, మంగళగిరి, తాడికొండ X రోడ్డు, రాజధానిలోని ప్లాట్లు పొలములు అ॥కొ॥. 9948779955 [G-8640]

FLAT FOR SALE
■ East Facing - 3BHK 1400 Sft Flat For Sale (Individual Floor) with all amenities (Incl Cupboard works) Near NAD. Ph : 97056 99402, 81211 94944 [V-6653]

PLOT FOR SALE
■ సంక్రాంతి ఆఫర్ రిజిస్ట్రేషన్ 'ఫ్రీ' విశాఖ 77వ వార్డు పరిధిలో 6 లక్షలకే 111 గజాలు ఇల్లు కట్టుకునేలా 150 బిట్లు కలవు. EMI కలదు. ఫోన్ : 80196 24319, 70936 32399 [V-796970]
■ విజయనగరం భోగాపురంలో VMRDA అప్రూవ్డ్ Plots అమ్మకంనకు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్, బ్యాంకులోన్ సదుపాయం కలదు. సంప్రదించండి : 89786 05566 [V-797158]

Services
ASTROLOGY
■ ICAS వైజాగ్ ❖ జ్యోతిష్యం ❖ వాస్తు సర్టిఫైడ్ డిప్లొమా కోర్సులు, ❖ Online / Offline ❖ అడ్మిషన్లు జరుగుచున్నవి ❖ క్లాసులు : ప్రతీ శని, ఆదివారాలలో @ గాయిత్రి కాలేజ్, ద్వారకానగర్, & @ అమర్ కాన్సెప్ట్ స్కూల్, NAD కొత్తరోడ్డు - జొన్నలగడ్డ శ్రీనివాస్, ఫోన్ : 99666 66659, 94413 89808, www.icasindia.org [V- 7525]

OLD AGE HOME
■ Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్: 87904 49799, 90103 92178 [V- 797111]

SEPTIC TANK CLEAN
■ బాలాజీ GVMC సెప్టిక్ క్లీనింగ్ హైటెక్ మిషన్‌తో ఇరుగుపొరుగు వారికి ఎటువంటి దుర్వాసన లేకుండా అతి తక్కువ ఖర్చుతో 5 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 90009 29977, 90009 27171 [V-2343]

Wanted
■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167597]
■ Wanted (M/F) MLM Leaders, Telecallers, Marketing Executives, Managers, PRO's and Agents, (P/F Time) Salary Negotiable. Ph : 93464 10329 [V- 2347]
■ Wanted Male Vice Principals, Computer Operators and Cashiers. Qualification any Degree/ B.Tech/ P.G, Age Limit: 25 to 45 years. Salary: 10000/- to 25000/- Location: Vizag. Contact: 8008557071, 9248733302 [G-4976]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.